

# పి.వి.బి. శ్రీరామమూర్తి

# రంగురంగుల కలలు

శేషగిరి ఉద్యోగంలో ప్రవేశించి ఇరవై ఏళ్ళు అయింది

ఇరవై యేళ్ళ క్రితం — అప్పుడే స్కూలు ఫైనలు పాసయిన శేషగిరి తండ్రి పలుకుబడివల్ల ఓ హైస్కూల్లో ఎల్ డి సి గా చేరాడు ఉద్యోగం వచ్చిన కొత్తలో శేషగిగి ఫీజులు కట్టడానికొచ్చిన ఆడపిల్లల ముందు నాగేశ్వ్రరావ్ ఫోజూ, మగపిల్లల ముందు ట్రయినింగ్ ఎస్సయ్ ఫోజూ కొడుతుండేవాడు

అప్పుడు శేషగిరి జీతం రెండొందలు రూపాయిలు

వందరూపాయల జీతం మీదనే

శేషగిరికి అధికారం ఉండేది. మిగతా వందరూపాయల మీదా అధికారం శేషగిరి తండ్రిది. శేషగిరి తనకోసం మిగుల్చుకున్న వందలో పదిహేను రూపాయలు తలదాచుకోటాని కిచ్చే వాడు. ఏభయ్ రూపాయలు కడుపు నింపుకోటానికీ ఇచ్చి, మిగతా ముప్ఫయయిదు రూపాయిల్లో అన్ని ఖర్చులూ సరిపెట్టుకుని కాలక్షేపం చేసేవాడు.

అప్పుడు శేషగిరికి అందమయిన ఆడపిల్లలంటే ఇష్టం ఉండేది. మల్లె పువ్వులన్నా, బీచిలన్నా, పార్కులన్నా ఇష్టం ఉండేది. వెన్నెలన్నా ఇష్టమే!

వెన్నెల్లో, అద్దెకుంటున్న ఇంట్లో డాబామీద పడుకున్నప్పుడు శేషగిరికి రంగు రంగుల కలలు వచ్చేవి. ఆ కలల్లో శేషగిరి ఆకాశ వీధిల్లోనూ, ఆనంద సందనాల్లోనూ విహరించేవాడు.

అప్పుడు వెన్నెల కురుస్తోంది. ఆ వెన్నెల మల్లెపువ్వులను కురుస్తున్నట్లుంది. వెండిరేకులను అతుక్కున్నట్లుంది. అందమయిన ఆడపిల్ల పెదాలమీద విరబూసే స్వచ్ఛమైన నవ్వులా ఉంది.

'ఆ వెన్నెల సుహాసిని పెదాలమీద నవ్వులాగే కనిపించింది!

అవును. సుహాసిని నవ్వితే వెన్నెలను వెదజల్లుతున్నట్లే ఉంటుంది. సుహాసిని నవ్వితే సెలయేటి గలగలలు వినిపిస్తాయి సుహాసిని నవ్వితే చిరుగంటల సవ్వడులు వినిపిస్తాయి

అవునిప్పుడు సుహాసిని ఎక్కడుందో! .. ఎలాగుందో?

సుహాసినిని జీవిత భాగస్వామిగా చేసుకోబోయే ఆ వ్యక్తి ఎవరో, ఎక్కడున్నాడో కాని అతనెంత అదృష్టవంతుడు!

ఎక్కడో ట్రెయిన్‌లో కలసి అక్కడే తెగిపోయిన పరిచయంలా స్కూలు ఫైనలు అయిపోగానే తనకి సుహాసినితో మాట్లాడటానికయినా అవకాశం లేకుండా పోయింది.' ఊహలలో తేలిపోతున్న శేషగిరిని తుంగచాపలో దాక్కున్న నల్లి చిటుక్కున కరిచి వాస్తవంలోకి తీసుకొచ్చింది. సుహాసినిని గూర్చి ఆలోచించే అర్హత కూడా లేదన్నట్లు చటుక్కున లేచిన శేషగిరి తుంగచాపమీద వెన్నెలలో తప్పించుకు పారిపోతున్న నల్లిని వెతికి పట్టుకుని కసిగా దాని రక్తాన్ని కళ్ళచూసాడు.

ఆ ఉదయం ప్రక్కవాటాలో ఉంటున్న లెక్చరర్‌గారి భార్య లలితాదేవి అన్నమాటలు గుర్తుకొచ్చాయి. "ఓయ్ తమ్ముడూ! మంచం ఎలాగుందంటావయితే?... బాగుంది... బాగుండదూ మరి? రెండొందలయింది! మరి నువ్వుకూడా ఇలాటి మంచం చేయించేస్కో. ఒక్కొక్కటి ఇప్పుడే సంపాయించుకోవాలి. ఆ తరువాత మరి వీలు పడదు పెళ్ళయి సంసారం పెరుగుతున్న కొద్దీ బాధ్యత లెక్కువయి

పోతాయి. మీ బావగారితో చెప్పెయ్యనా? డబ్బులు తాపీగా ఇవ్వొచ్చులే!"

"ఊహుఁ.... నేను తర్వాత చెప్తా లెండి!" అన్నాడప్పుడు. రెండొందలనే సరికి భయంవేసింది కాని తను వెంటనే మంచం చేయించుకోవాలి. మంచమే కాదు.. తను కొనుక్కోవాల్సినవి చాలా ఉన్నాయి.... ఫాన్ కొనుక్కోవాలి.. రేడియో కొనుక్కోవాలి.... మంచివి నాలుగు జతలయినా బట్టలు కుట్టించుకోవాలి!

ఫస్టుకి జీతాలందేకా ఓ 'మంచం' అయినా కొనుక్కోవాలనుకున్నాడు. ఆ తరువాత ఫస్టూ వచ్చించి. జీతమూ వచ్చింది. వచ్చిన జీతం మిగలకుండానూ అయింది. మంచం కొనుక్కోవాలన్న శేషగిరి కోరిక మాత్రం కోరికగానే మిగిలిపోయింది. మళ్ళీ నెల రానున్న అరియర్సు అందినప్పుడు మాత్రం 'మంచం' తప్పక కొనుక్కోవాలి అనుకున్నాడు. అలాగ తన కోరికను అరియర్సుతో ముడిపెట్టిన శేషగిరి ఆలోచనలను కట్‌చేస్తూ అతని చిన్నక్క గుర్తుకొచ్చింది. దసరా పండుగకు వచ్చిన చిన్నక్క ముందుగానే చెప్పింది. "ఒరే శేషూ! క్రొత్త పండక్కి ఏదో పెట్టిస్తావ్ అనుకొని వచ్చారా? కనీసం మీ బావ కయినా జత బట్టలు తీసావ్ కాదు... నువ్వు తీసుకోవటం మానే సావా చెప్పు?.... నీ వంతు పండక్కి వందరూపాయలిచ్చి చీర కొనాల్సిందే?.. అలాగయితేనే పండక్కి వచ్చేది.... ఇప్పుడే చెప్పేస్తున్నా...." ఆమె అంటున్నప్పుడు శేషగిరి నెత్తిమీద తాటికాయ పడినట్లయి గుడ్లు తేలవేసాడు.

"చూశావే అమ్మా....వీడు కనీసం 'అలాగే' అనయినా అనటంలేదు. వీడి పెళ్ళాం వస్తే మరి వీడేం పెడతాడే అమ్మా...."అని శేషగిరిని చిన్నక్క అంటున్నప్పుడు "అవునదీ నిజమే.... మరి పెళ్ళి చేసుకుని పెళ్ళాంకేం పెట్టగలను?"....అనుకున్నాడు.

"కొంటాడులేవే .... తమ్ముడు నీకు తప్ప ఇంకెవరికి కొంటాడు?" తల్లి సర్ది చెప్పింది. "ఏమో నాకు తెలియదు. వీడి వంతు చీర కొనిపెడితేనే వస్తాను. లేకపోతేమాత్రం వచ్చేదిలేదు." రక్తం పంచుకుని పుట్టిన శేషగిరి చిన్నక్క మాటలవి.

"ఒరే శేషూ! మరి వీళ్ళ కెప్పుడూ తప్పదుగాని....ము స ల్దా ల్ని....రేపో, నేడో అన్నట్టుగా ఉన్నాను. నాకో సైన్ గుడ్డమాత్రం కొనిపెట్టరా నాయనా..... మనవడి సొమ్ము అనుభవిస్తేగాని ముసలి ప్రాణం పోనంటున్నాది." అడ్డాళ్ళలో పెంచిన నాయనమ్మ కనీసపు కోర్కె వెల్లడి చేసింది.

శేషగిరికి మొదట పీకమొయ్యా కోపం వచ్చేసింది.

తరువాత మనసునిండా దుఃఖం వచ్చేసింది.

చిన్నక్కకి చీరకావాలి! చిన్నక్కకి కొంటే పెద్దక్క ఊరుకుంటుందా మరి! చెల్లి చిన్నది...దానికి బట్టలు కుట్టించక పోతే (నాన్న కుట్టించినప్పటికీ) అమ్మ భోజనంకూడా మానేస్తుంది. నాయనమ్మకి సైన్ పంచె కొనిపెట్టకపోతే జీవితాంతం సణుగుతూనే ఉంటుంది. అమ్మ తన ముందు అనకపోయినా తను వింటున్నట్లు నాన్నగారితోనో, అక్కయ్యలతోనో అంటుంది తనకి చీర కొనలేదని! నాన్నకు వంద రూపాయలూ పంపక పోతే ఆ విషయాన్నందరితోనూ చెప్తారు. ఇక వీధిలో అందరి ఎత్తిపొడుపులూ తన మీద....సానుభూతులు నాన్నమీద!

మరి వీళ్ళందరికీ ఇన్ని ఆశలున్నాయి. తనకీ ఇలాటి ఆశలున్నాయని వీళ్ళెవరికీ గుర్తుండదా? రెండొందల జీతంలో వంద తండ్రి జేబులోనే పడేస్తున్నా తను వీళ్ళందరి కోరికలను ఎలా తీర్చగలడనే కనీసపు టాలోచన వీళ్ళకు అసలుండదా? 'అరియర్సు అందినప్పుడూ తను కనీసం మంచం చేయించుకోకపోతే మరి తన కోరికలు తీర్చుకొనేదెప్పుడు?' అప్రయత్నంగానే శేషగిరి కళ్ళు చెమ్మగిల్లాయి.

అంత చీకటి బ్రతుకులోనూ, ఇరుకయిన మనుషులమధ్యనూ నలిగిపోతున్న శేషగిరికి ఆ వెన్నెలలో బంగారు భవిష్యత్తు కనిపించింది. కమ్మని కలలోకి లాక్కుపోయింది.

మరి కొన్నాళ్ళకి శేషగిరికి మేనత్త కూతురు సావిత్రితో పెళ్ళయింది. సావిత్రి శేషగిరి జీవితంలో ప్రవేశించిన తరువాత కొంత శాంతి లభించింది. ఎంత పెద్ద సమస్యనయినా చిరునవ్వుతో పక్కకి నెట్టేసే మనస్తత్వం సావిత్రిది. రిటయిరయాక వచ్చిన డబ్బుతో ఆఖరి కూతురికి పెళ్ళిచేసి తనబాధ్యత తీరిపోయిందన్నట్టుగా తనువు చాలించిన శేషగిరి తండ్రి తన బరువును కొడుకు భుజం మీదికి జరిపేశాడు. అందర్నీ పిలవకపోయినా పండక్కి ఆఖరికూతుర్నయినా పిలవకపోతే బాగుండదన్న తల్లిమాటను కాదనలేకపోయిన శేషగిరి అప్పుచేసి, చెల్లెలికీ, బావకీ కొత్తబట్టలు తియ్యగలిగేడేకాని కట్టుకున్న భార్యకిమాత్రం చీరయినా కొనలేకపోయాడు. ఆ దిగుల్తో ఆ రాత్రి నిద్రపట్టక బాధపడుతున్న శేషగిరిని సావిత్రి తనకంటే చాలా ముందు పుట్టినదానిలా మాట్లాడి ఓదార్చింది. అప్పుడే శేషగిరి మనసులో పేరుకుపోయిన దిగులంతా తొలగిపోయి "సావిత్రీ! ఇంతవరకూ నా 'సంసారం' కోసం నేనేమీ సంపాదించుకోలేదు.... ఇకమీదట ఒక్కొక్కటే కొనుక్కోవాలి! వచ్చేనెలలో మంచి మంచం కొనుక్కోవాలి!" అన్నాడు.

"తాపీగా కొనుక్కోవచ్చు లెండి. ఈ అప్పు ముందు తీరిపోనీండి!" అంది సావిత్రి. ఆ తరువాత శేషగిరికి ఇద్దరు

పిల్లలు పుట్టారు సంసారం పెరిగింది (అపరేషన్ కూడా చేయించుకున్నాడు !) జీతం పెరిగింది ధరలు పెరిగాయి బాధ్యతలు పెరిగాయి శేషగిరి వయస్సూ నలభై కి పెరిగింది అతని కోరికలూ పెరిగాయి

* * *

శేషగిరికి నలభై యేళ్ళ వయసొచ్చే సరికి అతని కోరికలకు ఇరవయ్యేళ్ళ వయసొచ్చింది అప్పుడు శేషగిరికి అంద వలసిన అరియర్సు రెండొందలు అంద డంతో మంచివస్తువు కొనాలనుకున్నాడు డైరెక్టుగా చెప్పకపోయినా సావిత్రికి రేడియోమీద మోజున్నదన్న విషయం గుర్తుకొచ్చింది శేషగిరికి అయితే రెండొందలు రేడియో కొనటానికి చాల దన్న విషయమూ వెంటనే గుర్తొచ్చింది శేషగిరి కొలీగ్స్ సహాపై ఐరన్ కాట్ తీసుకున్నాడు అప్పుడతనికేదో ఘన విజయం సాధించినట్లనిపించింది ఉరకలు వేస్తున్న ఉత్సాహంతో రిక్షాలో మంచాన్ని వేయించుకుని ఇంటికెళ్ళాడు

సావిత్రి వడ్డిస్తోంటే శేషగిరి భోంచేస్తున్నాడు తల్లి శేషగిరి ప్రక్కనే ఒళ్ళోపడుకున్న మనవరాల్ని జోకొడ్తూ కూర్చుంది అన్నం నోట్లో పెట్టుకుంటూ శేషగిరి సావిత్రిని అడిగాడు "మంచం ఎలాగుంది ?" అని

"మంచంకేం ? బంగారంలా ఉంది!" అలా అన్న సావిత్రి మాటల్లో కోపం, దుఃఖం కొట్టవచ్చినట్లు కనిపించాయి శేషగిరికి సాధారణంగా కోపం తెలియని సావిత్రి అలా కనిపించేసరికి శేషగిరి మరి మాట్లాడలేదు

"కప్పుకోడానికి దుప్పట్లులేక చలితో చస్తున్నాం, 'మింగ మెతుకులేదు మీసా లకి సంపెంగ నూనె' అన్నట్లు ఇప్పుడా మంచం కొనకపోతే ఏమొచ్చె? అగ్గి పెట్టెలాంటి ఈ గదిలో ఆ మంచమే సగం జాగా మింగేస్తుంది"

చలికాలం వస్తుంది దుప్పట్లు కొను క్కోవా'లని చాలాకాలంగా సావిత్రి చెపుతున్నమాట అప్పుడు జ్ఞాపకాని కొచ్చింది శేషగిరికి

"ఒరే శేషూ! మంచం మా బాగుందిరా! చెల్లి పెళ్ళికి దానికి మనం మంచమూ, పరుపూ కొనిపెట్టలేకపోయాం చెయ్యి తిరక్క పాపం వెట్టిది వచ్చినప్పు డల్లా గునుస్తూ వెళ్ళిపోతూనేవుంటుంది మనకెలాగూ గది చాలదు ఆ మాట నేనే అన్నాలనుకున్నాను సావిత్రే అనే సింది ఈ మంచం దానికిచ్చేస్తే ఎంత పొంగిపోతుందో పిచ్చిపిల్ల" తాపీగా అంది శేషగిరి తల్లి శేషగిరికి బాగా కోపం వచ్చేసింది

"అవున్లెండి ఇక్కడున్న ప్రతి వస్తువూ మీకు కూతురింట్లో వుంటేనే బాగుంటుంది ఇక్కడున్నవాళ్ళు మను షులుకారు మీ కేవేవి ఇచ్చెయ్యాల నుంటే అవన్నీ ఇచ్చెయ్యండి" ఆ మాట


లనేసిన సావిత్రి కళ్ళలోంచి వస్తున్న నీటిని కనిపించకుండా బుర్ర దించేసు కుంది.

"నా మీ దెందుకే అలా విరుచుకు పడతావ్! నేనేమన్నా ఇచ్చెయ్యమన్నానా! ఏమన్నానా? ఇస్తే సంతోషపడుతుంద న్నాను. అయినా ఇవ్వమనటానికీ, ఇవ్వొద్దనటానికీ నాకేం అధికారం ఉంది కక్కడ? ఏదో గతిలేక నాలుగు మెతు కులకోసం కక్కుర్తిపడి వుంటున్నానే తప్పితే!" ఆ మాటలన్న శేషగిరి తల్లి పైటతో కళ్ళొత్తుకుంది.

"ఇప్పుడెందుకమ్మా అవన్నీ. అవ కాశం చిక్కినప్పుడు ఏదో చూసి కొని పెడుతున్నాను కదా!... పోనీ మ సలి దానివి చలితో క్రిందనేం పడుకుంటావ్? నువ్వు పడుకో ఆ మంచంమీద." తల్లిని ఓదార్చే ప్రయత్నంలో అన్నాడు శేషగిరి.

"నా కెందుకు నాయనా! ఏదో పొర పాటున అనేసానేకాని నువ్వు పడుతున్న అవస్థలు నాకుమాత్రం తెలియవా ఏం? ఏదో మీ నాన్నగారితో అనే అలవాటు పోక అలా అనేశాగాని. సావిత్రికి బొత్తిగా చీరలులేవు. ఓ రెండు సాదా చీరలయినా తీసుకో," అంది శేషగిరి తల్లి. అని అక్కణ్ణించి లేచి వెళ్ళి పోయింది. తలవంచుకున్న సావిత్రి వెక్కి వెక్కి ఏడుస్తున్నట్లు గమనిం చాడు శేషగిరి. "సావిత్రీ! ఏంటది? తప్పు లే. కళ్ళు తుడుచుకో" అన్నాడు. సావిత్రి చాలా గంభీరమయిన మనిషని శేషగిరికి తెల్సు. మనసులో ఎంతో బాధతో సతమతమైపోతేనేకాని నోరెత్తి మాట్లాడదు. మరి అలాటి సావిత్రి ఎందు కిలా అయిపోయింది?

భోజనంచేసిన శేషగిరి జైలులా కనిపిస్తున్న ఆ గది వాతావరణంలోంచి బయటపడి స్వేచ్ఛగా గాలి పీల్చు కున్నాడు. బయట వెన్నెల. తీక్షణంగా నింగిలోకి చూస్తున్న శేషగిరికి చంద్రుడు వెక్కిరిస్తున్నట్లుంది. వెన్నెల వేధిస్తున్న ట్లుంది. విద్యుత్తులా కాల్చుతున్నట్లుంది. చలి నెర్వస్ ఇంజక్షన్లా నరాల్లోకి దూరి పోతోంది. గజగజలాడిస్తోంది. శేషగిరికి అక్కడా సుఖం కనిపించలేదు. ఇంట్లోకి వచ్చేశాడు. కొత్తమంచంమీద ప్రక్క వేసి ఉంచింది సావిత్రి. గదిలో ఓ మూల ముడుచుకుని మనవరాల్ని దగ్గరకు తీసు కుని, ఉన్న చినుగుల దుప్పటిని వొంటి నిండా కప్పుకుని, గోనెసంచిలో కట్టేసిన శవంలా-పడుకొని ఉంది శేషగిరి తల్లి. మంచం ప్రక్కగా దిగువున తుంగచాప పరుచుకుని, కుడిచేతిని తలక్రింద పెట్టు కుని కొడుకుమీద చెయ్యేసుకొని పడు కుంది సావిత్రి. తలుపు గడియపెట్టి మంచంమీద చొరబడ్డాడు. అర్ధరాత్రి వరకూ అటూ ఇటూ దొర్లుతూనే వున్నాడు. కాని శేషగిరికి నిద్రరాలేదు. సావిత్రితో కాసేపు మాట్లాడుకొని,



హాయిగా, సంతృప్తిగా పడుకోవాలన్న శేషగిరి కోరిక అతడికి నిద్రని దూరం చేసింది.

సావిత్రిని తల్చుకుంటేనే జాలేసింది. సావిత్రి చుట్టూ అతని అనురాగ లత అల్లుకుంది. సావిత్రిని లేపాలనిపించింది. సావిత్రి మాట్లాడితే తన మనసులో పెట్టిన ముసురు తగ్గుతుందనిపించింది.

సావిత్రిని లేపాడు మెల్లగా. అప్పటికి అరగంట క్రితమే తెలివొచ్చేసి రాత్రి సావిత్రికీ, తనకూ జరిగిన వివాదాన్ని నెమరు వేసుకొంటున్న శేషగిరి తల్లికి కొడుకుమీదా, కోడలిమీదా జాలేసి తనని తాను తిట్టుకుంటోంది. "పాపం....నిన్న ఏకాశి,..ఇవాళ శనివారం..వద్దంటున్నా సావిత్రి ఉపవాసం చేసింది కూడాను. దిక్కుమాలిన కోపంలో కాఫీచుక్కయినా కలిపి ఇవ్వలేకపోయాను." అనుకుంటున్న శేషగిరి తల్లి కొడుకు సావిత్రిని లేపటం వింది. ఆ సమయంలో 'సావిత్రి ఉపవాసంవల్ల నీరసంగా ఉంది' అన్న విషయాన్నెలా చెప్పాలో తెలియక లేచి లైటు వేసింది. శేషగిరి మంచంమీద చారబడిపోయాడు. "ఏమిటో పాకిరి నట్టయింది. ఎక్కడా ఏం కనిపించటంలేదు...." అని తనలో మెల్లగా అనుకుని "అయ్యో! నా మతి మండిపోనూ!.... సావిత్రికి కాస్త కాఫీ చుక్కయినా కలిపివ్వలేదు. నిన్న ఉపవాసం....ఇవాల ఉపవాసం. ఎలా ఉందో

పాపం!" కాస్త గట్టిగానే అంది అని లైటార్పి పడుకుంది మళ్ళీ

సావిత్రిని లేపుతున్నప్పుడు తల్లి లైటేసేసరికి సిగ్గుతో శేషగిరి ఒళ్ళంతా చచ్చినట్లయిది "వెధవఇల్లు తన పొడవుకి రెండున్నర అడుగుల పొడవు, అడుగున్నర వెడల్పు ఎక్కువగా ఉన్న ఈ ఇంటికి అద్దె నలభై అయిదు రూపాయలు పిండుతున్నాడు ఇంటి వెధవ అందరితో ఇక్కడ చావాల్సిందే తప్ప గత్యంతరంలేదు ఇంతకంటె మంచింటికి పోవటానికి తనకి స్తోమత లేదు" చిరాకేసింది శేష గిరికి, తన మీద, తన జీవితం మీద, ఇరుకు గదిమీదా తల్లి మాటలు గుర్తుకొచ్చాయి వెంటనే 'సావిత్రి అకల్తో ఎలా పడుకుందో ఏమో!' మనసు మూల్గింది

మూతిబడని రెప్పల్ని బలవంతంగా మూసుకున్నాడు మూసిన అతని కను రెప్పల్లో ఎర్రటి రక్తపు మంటలు చిమ్మచీకట్లు మళ్ళీ చిరువెలుగులు వెలుగురేఖల్ని మింగేస్తున్న దెయ్యాలు మింగటానికి పైబడుతున్న కొండ చిలువలు వాటితో పెనుగులాట శేషగిరి మెడ విరిచేస్తోంది విరిగిపోతోంది విరిగిపోయింది 'అమ్మో!'

శేషగిరికి తెలివొచ్చేసింది ఒళ్ళంతా చమట పట్టారా చూసాడు ఎవరూ లేరు దెయ్యాల్లేవు భూతాల్లేవు కొండ చిలువల్లేవు మెడ విరగలేదు మెడ చుట్టూ తడుముకున్నాడు ఎక్కడా రక్తపు తడి తగల్లేదు తల్లి సన్నగా వెలిగించి ఉంచిన బెడ్‌లైటు కాంతిలో అందరూ ఎవరిస్థానాల్లో వాళ్ళున్నారు తలుపుతీసి ఉన్న ఆ చిన్న వరండాలో బొంత వేసుకుని చలికి దగ్గరగా కూరుకుపోయి పడుకున్నాడు కొంతసేపటికి శేషగిరికి కాస్త నిద్రపట్టింది

చలి —

గుండు సూదుల్ని శరీరం నిండా గుచ్చుతున్నట్లుంది ఐస్ ముక్కల్తో శరీరాన్ని గాయపరుస్తున్నట్లుంది చల్లగా శరీరాన్ని కోస్తున్న చలిగాలికి సావిత్రికి తెలివివచ్చి పక్కకి వత్తిగిలి పడుకుంది తెరచి ఉంచిన తలుపు అవతల వాకిలిలో వెన్నెల వెలుగు కనిపించేసరికి సావిత్రి గాభరాగా లేచింది 'ఈయన తలుపు వెయ్యలేదా?' కంగారుగా లేచిన సావిత్రికి మంచంమీద శేషగిరి కనిపించలేదు వరండాలోకొచ్చి చూస్తే చలికి రోకలిబండలా చుట్టుకుని కనిపించాడు తలుపు దగ్గరగా వేసి వరండాలోకి వచ్చింది సావిత్రి సావిత్రికి శేషగిరి మీద జాలివేసింది 'చలి రంపపుకోత కోస్తుంటే ఎలా పడుకున్నారో పాపం,' అనుకుంది భర్త ప్రక్కన పడుకుని చలికి వజవజా వణికిపోతున్న శేషగిరికి

పైట చెరగు కప్పి దగ్గరగా తీసుకుంది శేషగిరి కూడా నిద్రమత్తులోనే సావిత్రిని దగ్గరగా తీసుకుని గబుక్కున తెలివొచ్చి అయోమయంగా ఎవరూ?' అన్నాడు

"ష్! నేనేనండి గోల చెయ్యకండి బాబు లేచిపోతాడు "

"ఇవతల చలి సావిత్రీ నువ్వింట్లో కెళ్ళి పడుకో "

"ఫరవాలేదు లెండి!"

శేషగిరి మాటాడలేదు సావిత్రి గురించి ఆలోచిస్తున్నాడు

"కోపం వచ్చిందా? రాత్రి నేనన్న మాటలకి ఇవతల పడుకుండి పోయారు "

శేషగిరి మంచులా కరిగిపోయాడు "లేదు సావిత్రీ! ఆ మంచంమీద నిద్ర రావటంలేదు పైగా అన్నీ భయంకరమైన కలలే వస్తున్నాయి మా 'రాజారావు' కావాలన్నాడు మంచం రేపిచ్చేస్తాను, గది చాలటంలేదని చెప్పి " అన్నాడు

"అక్కర్లేదులెండి కొనేసిన వస్తువు మరి రిటన్ చెయ్యొద్దు" అని కొంత సేపూరుకుని "ఇంతవరగూ పిల్లలకోసం మనమేం వెనక వెయ్యలేదు మనం ఎలాగూ సగం వయస్సులో కొచ్చేస్తున్నాం ఇప్పుడు మన ఆశలన్నీ వాళ్ళ మీదనే ఉండాలి మనం చేసే ప్రతి పనీ వాళ్ళని దృష్టిలో ఉంచుకుని చేస్తే వాళ్ళెవరైనా సుఖపడతారు" అంటున్న సావిత్రిని దగ్గరగా తీసుకుంటూ, "అవును సావిత్రీ! నువ్వు చెప్పిన మాటలు చాలా నిజమైనవి ఇకనుంచయినా పిల్లలకోసం కాస్త వెనకెయ్యాలి," అన్నాడు

"బాబు రాత్రి మీకోసం చూసి చూసి పడుకున్నాడు వాడికి అక్షరాలన్నీ వచ్చేసాయట క్లాసులో వాడికే ఫస్టుమార్కు వచ్చిందట " అని శేషగిరి పలక్కపోయేసరికి "వింటున్నారా? అయ్యో ఇప్పుడిప్పుడు మాటాడారు. అప్పుడే పడుకుండి పోయార్టండీ " అంది ప్రేమతో శేషగిరిని ముద్దు పెట్టుకుంటూ

శేషగిరి అక్కడే పడుకున్నాడు కాని అతనక్కడలేడు

అతని చుట్టూ కలలు రంగు రంగుల కలలు టెక్నికలర్ కలలు!

అందులో శేషగిరి -

శేషగిరి కొడుకు కలెక్టరయాడు కూతురు పెద్ద డాక్టరయింది పెద్ద బంగళా చుట్టూ నౌకర్లు జీపులు కార్లు కారులో సావిత్రి సావిత్రి ప్రక్కన శేషగిరి అరవై యేళ్ళ శేషగిరి పాతికేళ్ళ వయసువాడై, ఇరవై ఏళ్ళ సావిత్రితో సరసాలాడబోతుంటే సావిత్రి వారిస్తోంది "ష్! ఏంటి మీ చిలిపిచేష్టలు?"

---